సింగిల్ పేజీ కథ

# మనస్తత్వం

## ఊర్మిళా సుభాన్



ఒక ఫ్రెండ్ ఇంటినుండి వచ్చినప్పటి నుంచీ మూడీగా ఉంది శ్వేత. తను అలా ఉండటం ఏమాత్రం నచ్చదు భర్త రవి కాంత్‌కు.

"అదేమిటోయ్. మీ ఫ్రెండ్ గురించి ఏమేం విశేషాలు చెప్తావ్ అని నేనెదురు చూస్తుంటే అలా మసకేసిన ఆకాశంలా మారిపోయావేం? ఏం జరిగింది?" ఆప్యాయంగా అడిగాడు.

"ఉహూ..." అతి ముభావంగా చెప్పింది.

అలా అందంటే మరింకేం అడిగినా నోట్లోంచి ఒక్కముక్కా బయటికి రాదు. అందుకే తానూ మూడీగా మారిపోయాడు. అలవాటు ప్రకారం తానే రాజీకొచ్చింది.

"అదికాదండీ! ఆ నీలిమా వాళ్ళింట్లో ఓ మంచి డిన్నర్‌సెట్ ఉంది. రేటెంతో తెలుసా! ఎనిమిది వందలు. అబ్బ. ఎంత అందంగా ఉందంటే... ఓహ్. మాటల్లో చెప్పలేం! మనమూ తీసుకుందామా?" ఆశగా అడిగింది.

"అంత ఖరీదైన సెట్ మనకెందుకు చెప్పు నీలిమవాళ్ళు ఉన్న వాళ్ళేమో... కొన్నారు. మనలాంటి మిడిల్ క్లాస్‌వాళ్ళకి..."

పూర్తి చేయనీయలేదా వాక్యాన్ని.

"మనది మిడిల్‌క్లాస్ కంటే ఓ మెట్టు ఎక్కువే! బోడి ఎనిమిది వందల సెట్ కొనలేమా?"

"కొని ఎక్కడ పెడ్తావ్?"

"అటకమీద డైనింగ్ టేబిల్ కొని అప్పుడు వాడుకుందాం." తిరుగులేని నిర్ణయాన్ని ప్రకటించేసింది.

చూసిన ప్రతి వస్తువూ కొనాలనే ఈ మనస్తత్వం అప్పుడప్పుడూ కోపం తెప్పించినా 'పోన్లే... తన కోరిక ఇంకెవరు తీరుస్తార'ని తానే రాజీపడుతుంటాడు రవికాంత్.

అయితే కొనాలనుకున్నవస్తువు అవసరమా కాదా అనే విషయం ఆలోచించదు. అదే తలనొప్పి శ్వేతతో.

ఎలాగైతేనేం రెణ్నెల్ల తర్వాత డిన్నర్‌సెట్ ఇంట్లోకి వచ్చేసింది. ఆ రెండు నెలలు ఆఖర్నొద్దు... ఇవి వద్దు అని ఎన్నికట్టుదిట్టాలని! ఆ రోజు శ్వేత సంబరం అంబరాన్ని తాకింది.

"ఇంకేం! పంతం నెగ్గిందిగా! వెళ్ళు. వెళ్ళి ఈ పక్కింటి వాళ్ళకూ.. ఆ పక్కింటి వాళ్ళకూ చూపించు." తమాషాగా అన్నాడు రవికాంత్.

"ఛ. వాళ్ళకెందుకు చూపడం? చూసినదల్లా తెచ్చేసుకునేరకం. అయినా ఇలాంటివి వాళ్ళ కెందు కండీ! వాళ్ళకంత కాస్ట్లీ ఫ్రెండ్స్ ఎవరున్నారు? నేను తెచ్చానంటే చాలు. వాళ్ళూ తయారౌతారు. అవసరమా కాదా అని కూడా ఆలోచించరు..."

శ్వేత ఉపన్యాసం కొనసాగుతూనే ఉన్నా... ఆ మాటలేవీ విన్పించనంతగా నిర్ఘాంతపోయాడు శ్వేత భర్త రవికాంత్.

★